# విశాల హృదయుడైన భర్త

**మా**వారు ఒక సివిల్ ఇంజనీరు. అసలు నేనొక ఇంజనీరు భార్యనవుతానని కలలోకూడా ఊహించలేదు. అయినా అందరు ఇంజనీరు భార్యల్లా నేనొక యాంత్రికమైన భార్యను కాకపోవడం నా అదృష్టం అనుకుంటా. ఆయన ఆఫీసు పనులు ఏ కొద్దిగంటలో హృదయాన్ని బిగిపట్టుకొని పూర్తి చేసుకొని వచ్చేవారు. తరువాత అన్నిగంటలూ ఏదో అనిర్వచనీయమైన ఆనందాబ్ధిలో ఓలలాడేవారం.

అట్లా ఆరుసంవత్సరాలు మాకు తెలియకుండానే గడచిపోయాయి. అన్నాళ్ళూ ఒక తీయని కలలా గడిచింది మా జీవితం. ఇద్దరు పిల్లల తల్లి నయ్యానుకూడా.

×××

"మేడంబావెరీ" నవల అచ్చేసినపుడు ఆ రచయితను కోర్టు పాలు చేశారు ఫ్రెంచి దేశీయులు. కాని ఆ రచయిత చిత్రించింది, నగ్న వాస్తవమైన మూలాన అది ప్రపంచ చరిత్రలో ఎప్పటికీ నిలువజాలినదైంది.

అట్లాంటి శ్రీమతులు నాటికీ, నేటికీ, ఏనాటికీ లోకంలో, ఏ దేశంలోనైనాసరే ఉంటారనేది పరమసత్యం. అది చాటడానికే నేనీ కథ చెప్పుతున్నది; చెప్పడానికి సిగ్గు చెందకుండా చెప్పబూనుకున్నది.

ప్రతీవాళ్ళ జీవితంలోనూ కామగండం అన్నది ఎప్పుడో ఒకప్పుడు రాకమానదని అంటారు. అట్లాగే మా జీవితంలోనూ సంభవించింది.

నేను దీని కేమీ చింతించడంలేదు. ఎవరినీ నిందించడం లేదు. బహుశా మగవాళ్ళు విశాల హృదయులు అయిన మూలాన ఇటువంటి వింతగాథలు సంభవిస్తూ వుంటావేమో "అనాకెరీనా" మాత్రం – అంతేగా! మితిమీరిన స్వాతంత్ర్యం భార్యలకు ఉండకూడదనుకుంటాను. పంజరం నుండి విడివడ్డ పక్షుల్లా వాళ్ళు స్వేచ్ఛావిహారాలకి దిగుతారు; పట్టశక్యం కాదు.

నేను అందగత్తెననిగూడా అందరూ అంటుండగా విన్నాను. పైగా నా అందాన్ని

గురించిన గర్వం నాకు లేకపోలేదు. తన సౌందర్యాన్ని గుర్తెరిగిన స్త్రీకి అహంభావం ఎక్కువ.

మా ఇంట్లో నామాట చెల్లనిరోజులేదు. నే చెప్పింది వేదం కానిరోజులేదు. నేనే సర్వాధికారిణి నయ్యాను.

బహుశా ఆయనకి నన్ను గురించి ఉన్న గొప్ప భావమే, నాపై నాకు గొప్ప భావం ఏర్పడేలాచేసి, నా "అహాన్ని" ద్విగుణీకృతం జేసిఉంటుంది. నా అంత "ఎగోయిస్టు" ఎవరూ ఉండిఉండరు. తన ప్రేమవల్ల పైకెత్తేశారాయన.

మాటల సందర్భంలో చెప్పడం మర్చా... నేను "గొప్ప ఆర్టిస్టునని ఆయన భావం. మానాన్న చిత్రకారుడు. చిన్నతనంలో ఆయన్ననుకరించేదాన్ని. అదిచూచి ఆనందించిన నాన్న నాకు చిత్రకళ నేర్పాడు. చిన్నతనంలో నుండే నీటిరంగులతో చిత్రించడం, నూనెరంగుల స్కెచ్‌లు గీయడం నేర్చుకున్నాను. అదిదెల్సిన "మావారు" అమితానందభరితులయ్యారు. ఆ కళలో నన్ను ప్రోత్సహించేవారు. ఎంతగానో!

***

ఆ మధ్య మనపట్నంలో "అఖిలభారత చిత్రకళా ప్రదర్శనం" జరగలేదూ, దానిలో నా చిత్రాలనికూడా ప్రదర్శింపజేశారు - అంతా మావారి ప్రోత్సాహంవల్లనే అందులో ప్రైజురాకపోయినా బాగుండిపోయేది కాదూ - కాని ఇట్లా జరగాల్సిందికదా? అందుకేనేమో ఫస్టుప్రైజే వచ్చింది. దానితో మహిళాసంఘాలు, చిత్రకారులసంఘాలు, లలితకళామండళ్ళూ, పురపాలక సంఘము సన్మానించడంలో నాపేరు తారాపథాని కందుకుంది. అందరికళ్ళూ నాపైనే; అందరి పెదవులపైనానాపేరే. నా ఆనందాన్ని నేనే కొలుచుకోలేకపోయేదాన్ని. ఇక వారి ఆనందంచెప్పశక్యం కాదు. పేపర్లో వ్యాసాలొచ్చేయి.

అవును... ఆనందం... నిర్మలానందం....

"ఆనందం"... కదూ... అన్నాను. అవును ఆనందం గారూ... ప్రముఖ కళాకారుడు, కళాతపస్వి... అతని పరిచయం... ఆవేళ... పారిశ్రామిక ప్రదర్శనంలో జరిగిన తొలిదర్శనంనాటి... ఆనందం... వర్ణించతరం కాదు. ఎంత సుకుమారుడు! ఎంత అందగాడూ!!... నిజంగా ఆనందమూర్తే!

నన్ను ప్రదర్శన నిర్వాహకులు స్త్రీల తరఫున సభ్యురాలుగావేశారు. మొదట నేను నిరాకరించాను. కాని మావారు పట్టువిడువలేదు. మచ్చనెరుగని మధురమూర్తి పాపం! కాని... ఆనందమూర్తి... అనంతమైన చమత్కారి; చిత్రకళానైపుణ్యంతోబాటు, వాక్చాతుర్యం నన్నాకర్షించింది. ఆ నెలా చిత్రకళా ప్రదర్శన నిర్వాహణలో ఆనందాన్ని ఉపాసిస్తూ గడపేను; ఆయన పేరాక మంత్రదండమైంది. ఆయన సాన్నిధ్యం మాయాజాల పరిష్వంగం ఆయనమాటలు అమృతధారల కురిపించే మాటలే! ఇది వాస్తవమా? కలా? మనమున్నది

ఒక సమాజమా? ఒక దివ్యలోకమా? ఈతిబాధారహిత నవ్యనందనవనమా? ఏమీ తోచలేదు... ఏమి జరుగుతున్నదీ ఎరుగను... పరుల రాక; పలువురున్నారనే భీతి; ఏమీ అనిపించలేదు. మోహజాలం అట్లాంటిది గావును... అదే అనిర్వచనీయమైన ప్రేమనిపించింది. ఆనందమే నేనూ; నేనే ఆనందం; మిగతావన్నీ విషం - విషాదం!! అని జీవితావేశాన్ని అలముకొన్ని కారు మేఘాలు; కాని, పాపం వారు - వారొక మిణుగురు! కటిక చీకటిలో వెలుగునిచ్చే అందరానితార! అందమైన తార! ఆనందించలేని తార!

అయితేనేం అందమైన అందరాని తారకన్న ప్రక్క నున్న కుసుమాన్నే ఆశిస్తాం... ఆనందిస్తాం... గగన కుసుమారులెవరు కోరుకుంటారు?

***

మావారు నా కళారాధనకి మురిసిపోయేవారు నా ఖ్యాతి దేశమంతా వ్యాపిస్తుంటే ఆయనకళ్ళు మెరిసిపోయేవి ఆయన నన్నెంత గాఢంగా ప్రేమిస్తారో నేనెరుగకపోలేదు. దాన్ని గౌరవించకపోనూలేదు.

కాని... ఆనందమూర్తి అతనిప్రేమ వేరు... అతని సామీప్యమే శరీరానికి గగుర్పాటు కలిగిస్తుంది. మాట మనసుని ద్రవీభవిస్తుంది... స్పర్శ విద్యుల్లతలను శరీరంలో వ్యాపింపజేస్తుంది. అధరంమధురామృతఝరిని గుర్తుకు తెస్తుంది.

ఎగ్జిబిషన్ ఉన్నన్నాళ్ళు ఆనందం స్వేచ్ఛగా మా యింటికి రాసాగేడు.

కారులో తనతో వివిధ కార్యక్రమాలకు తీసుకువెళ్లేవాడు. ఒకటి రెండుసార్లు కూడా అతను బలవంతంచేస్తే మావారు ప్రదర్శనశాలకి వచ్చి, మా కార్యక్రమాలని పరిశీలించి, ఆనందించేరు. కాని ఆయనకి ఏకోశానా మాపై అనుమానం కలుగలేదు. ఆనందం అంతగొప్పగా ప్రవర్తించేవాడు. నాకదే ఆశ్చర్యంవేసేది. నేనే ఏ నిద్రలోనన్నా, పొరపాటునగాని బయట పెట్టేస్తానేమోనని భయపడేదాన్ని.

నా దురదృష్టమో, అదృష్టమోగాని ఆఖరివారంలో ఆయన క్యాంపుకు వెళ్లేరు. వెడుతూ సెలవుకదా అని, నే నొద్దు అన్నా పిల్లల్ని తీసుకెళ్లేరు.

ఇంక నా కడ్డేముంది. ఆ రాత్రి పదింటికి ఇంటికే వొచ్చేశామిద్దరమూను. ఆనందానికంతులేదు. రాత్రంతా మైమరచి కౌగిలిలో లీనమయ్యాను. వళ్ళు జలదరించింది. ప్రాతః కాలపు తొలివాయుతరంగానికి వణికే కొబ్బరి ఆకులలా ఒకముద్దు... అమృతప్రాయం నాకు నూతన యవ్వనం మొలకెత్తినట్టనిపించిది. పదేళ్ళు చిన్న అయినట్టూ అదే ప్రథమ ప్రణయఘట్టం అయినట్టూ అనుకున్నాను.ఏనాడూ కలుగని అద్భుతానందానుభూతి ఆవేళ హస్తగతమైంది. మేమిద్దరమూ ఒకటే ఏదో శాపంవల్ల ఇలా విడివడ్డామేమో? మళ్ళా అందుకే భగవంతుడే ఆవిధంగా మమ్మల్ని కలుపుతున్నాడుగావును, అనుకున్నాను. మంచీ

చెడ్డా విచక్షణా జ్ఞానం ఎపుడో అట్టడుక్కుపోయింది. శారీరకశక్తులదే గెలుపు.

అతను ఒక "ఆర్టు ఎకాడమీ" స్థాపించాడు. ఓ రోజు ఆదివారం ఉదయానవచ్చి మావారితో ఏమో మాట్లాడాడు. నన్ను పిలిచారు.

నేను "డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాను"

"ప్రభా! నువ్వు వీరి ఆర్టు ఎకాడమీలో పనిచెయ్యాలి" అన్నారువారు.

నేను మౌనంవహించాను; కాని కథ అర్థమైంది. పన్నాగమంతా ఆనందానిదన్నమాట

ఆనందం: "చూడండి జీతం అంత ఎక్కువయివ్వలేం; ప్రభుత్వం ఇప్పుడే గుర్తించింది. ఎక్కువ కృషి చేస్తే ప్రజాదరణ పొందుతాం" అన్నాడు.

నేను అప్పటికీ మాట్లాడలేదు.

"మాట్లాడవేం?" అన్నారువారు.

"మీకు శక్తిసామర్థ్యాలున్నంతకాలం నేను పనిచెయ్యడమెందుకండీ? ఆర్జన చాలకా?" అన్నాను ఆయన నవ్వాడు. కష్టపడడం విధి; నేను అకస్మాత్‌గా... మరణిస్తేనో..."

"ఛా" అంటూ ఆయన్ని అడ్డగించాను.

"కళారాధనగానైనా..." అంటూ ఆనందం కొసిరాడు.

"అవును...." ఆయన సమర్థించాడు.

కాసేపు అంతా ఊరుకున్నారు. "బోయ్" కాఫీలు అందించాడు. ముగ్గురం తాగాం.

"మరి పిల్లలు..." అన్నాను గొణిగినట్టు.

"దాదిని పెడదాం" అన్నారాయన.

నాలో 'ఇడ్ ఇంపల్‌సెస్'కీ, "సూపర్ ఇగో" కి మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. ఒక ప్రక్క కోరిక ప్రేమ సఫలమయ్యే లక్షణాలు! మరొక ప్రక్క నమ్మిన బంధుకోటికి అన్యాం చేస్తున్నాననే భయం; ఒకప్రక్క అణగారని ప్రేమ జ్వాల; మరొకప్రక్క పతనాన్ని కోరని నైతిక విలువలూ!

ఇది ప్రేమా లేక వర్టి ఇన్‌ఫాచ్యుయేషనా? ఆనందం ఎడల ఎందుకంత అనంతాకర్షణ?

అంతవరకూ అయోమయంగా, జీవితసత్యాన్ని గమనించనిదానిలా, అజ్ఞానురాలిగా బతికాననిపించింది. ఆనందం తోడిస్నేహం, అతని ఎరుక జీవితపు విలువల్ని జూపి, నా బతుకుబాటలలో నూతన వలువల్ని పర్చినట్టుంది. ఏదో, ఎవరూపొందని అనుభవాన్ని, నేను చవిచూసినట్టనిపించింది... ఇహమే స్వర్గమనిపించింది.

లోలోపల గగ్గోలుపెట్టే "సూపర్ ఎగో"ని లోపలికి నెట్టి, వారికోరికను అర్థమనస్కంగా అంగీకరించినట్టే కనపడ్డాను.

అంత బలవంతపరిస్తేనేగాని ఒప్పుకోలేదు, కనక నా మీద ఆయన నమ్మకం మరీ ఎక్కువైంది.

కొన్నాళ్ళతర్వాత ఓ ఆలోచన కలిగింది. ఆవేళ రాత్రి అన్నాను: "నే నీపని చెయ్యలేకపోతున్నాను. మీకు భోజనం సదుపాయంలేదు; పిల్లలమీద శ్రద్ధ వహించడానికి కుదరడంలేదు; అందుకని విరమిస్తాను".

"అట్లా ఎందుకని?"

"మరేంచేస్తాం?"

"పోనీ ఓపని చేస్తేనో?"

"ఏమిటంటారు?"

"మనయిల్లు ఇంత పెద్దదిగావుంది. మీ చిత్రకళాశాల కూడా ఇక్కడే పెడదాం; అప్పుడు కొంతఅద్దె కల్సివస్తుంది, నువ్వు దూరమూ పోనక్కరలేదు. ఆనందంగార్ని ఈ సలహావిషయమడుగు"

నేను మాట్లాడలేదు. ఆయన మళ్ళా రెట్టించారు.

"మీరే కనుక్కోండి. ఆయన ఒప్పుకోరనుకుంటాను" అన్నాను. మనస్సులో ఇష్టపడుతున్నా.

***

ఆయన మర్నాడు వెళ్ళి కనుక్కున్నారు. అతను కూడా మా యింట్లోనే ఓ గదిలో వుండడానికి నిర్ణయం జరిగింది.

త్వరలోనే మా యిల్లు చిత్రకళాదేవతకి ఆలవాలమైంది, ప్రభుత్వం నడిపే హయ్యర్, లోయర్ పరీక్షలకు పిల్లలకు శిక్షణ ఇచ్చేవాళ్ళం. అంతేగాకకొంతమంది విద్యార్థులు కమర్షియల్ చిత్రకళాభ్యాసానికి కూడా వొచ్చే వారు...

మా పాఠశాలతోబాటు ప్రేమకూడా దినదిన ప్రవర్థమానమవసాగింది.

కలకాలం లోకంకళ్ళు మూయగలగడం మానవ సాధ్యంకాదు. గోబెల్సు సిద్ధాంతం అన్నివేళలా అక్కరకు రాదు.

ఓనాడు మేము రాత్రివేళ కేళీవిలాసాలలో నిమగ్నులమై ఉండగా ఆయన అకస్మాత్‌గా విచ్చేశారు.

ఏం చెయ్యాలి? మేం ఇంట్లో నిర్బంధితులమైపోయాం. ఆనందం గదిలోనికి వెళ్ళాలంటే వీధిహాలులోనుండే మార్గం. అక్కడే ఆయన! నా గుండెలు గుభేలుమన్నాయి. అంత ప్రేమపిపాసి ఆనందం నీరైపోయాడు. నేనే ధైర్యం చెప్పి తలుపుతీశాను.

ఆయన నిశ్చేష్టులైపోయేరు. అక్కడే అట్లాగే పడక కుర్చీలో కూలిపోయేరు. ఆనందం చల్లగా నిష్క్రమించేడు. నేను అన్నిటికీ తలవొగ్గి, మొండిధైర్యంతో నిలబడ్డాను.

ఆయనేం మాట్లాడలేదు. టూర్‌నుండి రాగానే భోజనం చేసేవారు. ఏమీవొద్దన్నారు. ఉలకలేదు; పలకలేదు; అట్లాగే మౌనముద్ర వహించేరు.

నా ధైర్యం కరగిపోయింది. ఆయన పాదాలచెంత వ్రాలాను. "నన్నామీరు క్షమించలేరు నా పాపానికి నన్నే వొదలండి. నేను మీకు మరవరాని ద్రోహంచేశాను" కళ్ళనీళ్ళతో ఆయనపాదాలు కడిగేను.

ఆయన మధురమూర్తి విషపుచింతనలేని విశాల హృదయులు. చివరికి -

"లే, ప్రభా! లే! నువ్వు నా హృదయాధి దేవతవనుకున్నాను. కాని... నువ్వు అహల్యవే... ఆడదానివే? నిన్నని ఏంలాభం! అంతా నా దుష్కర్మ... అంతే..."

మర్నాడుదయం ఈ లేఖ దొరికింది:-

ప్రభా!

నేను మిమ్మల్నిద్దర్నీ క్షమించాను - కాని భగవంతుడు నన్ను క్షమిస్తాడో లేదో? ఆ క్షణంలో నా ఉద్రేకాలను నేనే సంబాళించుకోలేకపోయేను. నా మర్యాదకోసం... మీ ఇద్దరిలో ఎవర్నో ఒకర్ని హత్యచేద్దామన్నంత కోపం వొచ్చింది. కాని ఏం లాభం... నా ప్రభ నాకు రాదు- నాది కాదు.

అందుకే ఇట్లా నిర్ణయించుకున్నాను...

గాడ్రెజ్ అల్మార్‌లో విల్లువ్రాసివుంది. ఆస్తి అంతా నా పిల్లలకే చెందుతుంది నువ్వు వాళ్ళమైనారిటీ తీరేవరకూ వాళ్ళ గార్డియన్‌వి. వాళ్ళనైనా జాగ్రత్తగా చూసుకో...

మర్యాదకోసం మరణాన్ని ఆహ్వానిస్తూన్న...

నీ

................."

గూడ్సుట్రైన్‌కింద గుర్తుతెలియనిశవం దొరికినట్టూ, ఆత్మహత్య అని పంచాయితీతీర్పు అయినట్టూ, మర్నాడు పేపర్లోవార్త - నా నెత్తిన పిడుగుపడినట్టు.

పురుషుల్ని దూరంనుండి చూస్తోంటే, ఎంతో గంభీర వదనులుగానూ, సాహసవంతులుగానూ కనిపిస్తారా, అట్లాంటిది, సమయం వొచ్చినప్పుడు - చెప్పలేనంత పిరికివాళ్ళైపోతారు.

అదేవిషయం ఆనందంలో చూసేను. పై సంఘటన జరిగిననాటినుండీ, అతనిలోని పిరికితనం పెల్లుబికివచ్చింది.

"ఇల్లు ఖాళీచేస్తా"ననీ "వేరేచోటికి పాఠశాల మార్పిస్తా"ననీ ఎంతో ఇదైపోయేడు. నేనే ధైర్యం చెప్పేను!

ఒక ఏడాది గడిచింది. నాకు నెలతప్పడమూ, ఆనందం అదృశ్యమవడమూ ఒకేసారి జరిగింది. నేను చిత్రకళాశాల మూసేశాను.

కాని అక్కడే గడపడం దుర్భరమనిపించింది.

అందుకని ఎక్కడికిపోవాలో తోచలేదు. బంధువులంతా వెలివేసినట్టు చూడసాగేరు.

ఇల్లు తాళంవేసి వైజాగ్ వెళ్ళిపోయేను, పిల్లలతో, కొన్నాళ్ళు అజ్ఞాతంగా బతుకుదామని.

అక్కడే ఓ హాస్పిటల్‌లో పురుడుపోసుకున్నాను - ఆనందం ప్రేమఫలితంగా ఓ పురుషశిశువూ!

తిరిగి రెండేళ్ళతర్వాత స్వంత ఇంటికి చేరాను. నా పిల్లల్ని చదివించుకుంటో, జీవితం వెళ్ళబుచ్చుతున్నాను. వీళ్ళతోబాటు నలుగురు పిల్లల్ని పోగుచేసుకుని, వీధిబడి నడుపుకుంటో కాలక్షేపంచేస్తున్నాను.

నేను పతితనైనా పిల్లల్ని గొప్పగా చేయాలని ఆకాంక్ష! నా భర్తలా విశాలహృదయులుగానూ, ఇతరుల తప్పిదాల్ని మన్నించేంత ఘనులుగా చెయ్యాలనేదే నా బలమైన కోరిక! అందుకే నే జీవించివుంటున్నది!!